

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM


# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను




Contact Number
9059328777

రంగారెడ్డి శనివారం 28-03-2026 సంపుటి: 01 సంచిక : 281 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 28-03-2026 Volume :01 Issue: 281 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani

# వృత్తి లైన్ మెన్...
# ప్రవృత్తి అక్రమ ఇసుక దందా...!


**అక్రమ ఇసుక రవాణాలో పట్టుబడ్డ ఎలక్ట్రిసిటీ లైన్‌మన్**



- కేసు నమోదు అయినా శాఖాపరమైన చర్యలకు వెనకాడుతున్న అధికారులు..!
- గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయన్న ఆరోపణలు
- "కంచె చేను మేస్తోంది" అంటూ ప్రజల తీవ్ర విమర్శలు
- అక్రమ ఇసుక రవాణాతో ప్రభుత్వానికి భారీ స్థాయిలో ఆదాయం నష్టం
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ స్థానిక ప్రజల డిమాండ్..

**యాదాద్రి భువనగిరి, మార్చి27 (నేటి దర్శిని** ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి రావడంతో ప్రభుత్వ యంత్రాంగంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే అక్రమ ఇసుక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "కంచె చేను మేస్తోంది" అన్నట్లుగా పరిస్థితి మారిందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. అడ్డగూడూరు మండల పరిధిలోని ధర్మారం బిక్కేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమయంలో విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న తూప్పతి కృష్ణమూర్తి (48)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అడ్డగూడూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ప్రస్తుతం ఆత్మకూరు మండలం కప్రరాయిపల్లి సబ్‌స్టేషన్‌లో లైన్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు అడ్డగూడూరు ఎస్ఐ బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా,

-మిగతా 2 లో



**అధికారుల అండతోనే దందా కొనసాగుతోందా..? అనుమానాలు**



# సిద్దిపేటపై కాంగ్రెస్ గురి

**పార్టీ అభ్యర్థి గెలిస్తే మంత్రి పదవి ఇస్తానన్న ముఖ్యమంత్రి**


- 35 ఏండ్లుగా గెలుస్తున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు
- హరీశ్‌రావుకు చెక్ పెట్టేలా వ్యూహాలు
- ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని కవిత ప్రకటన

**మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

సిద్ధిపేటలో పాగా వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. మూడు దశాబ్దాలకు పైగా కేసీఆర్, హరీశ్‌రావు గెలుస్తూ తమ కంచుకోటగా కాపాడుకుంటున్న సిద్ధిపేటను హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాలు పన్నుతున్నారు. అందులో భాగంగానే సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సందర్భంగా సిద్ధిపేట ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. దాంతో సిద్ధిపేటలో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి.

-మిగతా 2 లో





# ఇండియా స్ఫూర్తితో కృషి చేయాలి

- ప్రధాని మోడీ
- ఇంధన సంక్షోభ నేపథ్యంలో రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష
- పలు రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్


**న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు మినహా మిగిలిన రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. యుద్ధంతో ఇంధన సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో రాష్ట్రాల సన్నద్ధతపై, వారి ప్రణాళికల పై సమీక్ష జరిపారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో ఈ కృషిలో సమన్వయం సాధించడమే ఈ వీడియో సమావేశం లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. సుమారు రెండున్నర గంటల పాటు చర్చలు కొనసాగాయి. పశ్చిమాసియా యుద్ధం వేళ ఇంధన సంక్షోభం, తదితర అంశాలపై చర్చించారు.పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలపై మాట్లాడారు. దీనిలో భాగంగా పీఎం మోడీ మాట్లాడుతూ... కలిసికట్టుగా పని చేస్తేనే పరిస్థితులను అధిగమించొచ్చన్నారు.

-మిగతా 2 లో

# నేటి నుంచి ఐపీఎల్

**హైదరాబాద్, బెంగళూరు మధ్య తొలి పోరు**



**బెంగళూరు**

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రికెట్ పండుగ రానే వచ్చింది. మండు వేసవిలో ఇంటిల్లిపాదిని అలరించేందుకు అన్ని హంగులతో ఐపీఎల్ ముస్తాబైంది. సొంతగడ్డపై ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్ విజయాన్ని ఆస్వాదిస్తూనే ఐపీఎల్ మజాను పొందేందుకు ఫ్యాన్స్ ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. 18 సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకుని 19వ సీజన్‌లోకి అడుగుపెడుతున్న ఐపీఎల్..ఈసారి మరింత జోష్‌ను అందించడం ఖాయంగా

-మిగతా 2 లో

# హెచ్-1బీ వీసాదారుల వేతనాల పెంపు!

విదేశీయుల నియామకాలను తగ్గించేందుకే..

2 లో




# నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం

**అతి పిన్న వయస్కుడిగా రికార్డ్**

**కాఠ్‌మాండూ**

'బాలెన్'గా ప్రసిద్ధుడైన బాలేంద్ర షా నేపాల్ ప్రధానిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. తన ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామచంద్ర పౌడెల్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.నేపాల్ ఉప రాష్ట్రపతి, సీజేఎన్, మాజీ ప్రధానులు, తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

-మిగతా 2 లో



# పకడ్బందీగా పెట్రో ఉత్పత్తుల సరఫరా




- రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటు
- పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఇందన సంక్షోభంపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

-మిగతా 2 లో



# పెరుగుతున్న ఉద్రిక్తతలు

- చర్చలంటూనే అమెరికా, ఇజ్రాయిల్ దాడులు
- రెండు దేశాలకూ ఇరాన్ గట్టి సమాధానం
- గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై స్ట్రైక్స్
- హార్ముజ్‌లో పాకిస్తాన్ జెండాతో అమెరికాకు చమురు ట్యాంకర్
- క్షిపణులతో దాడి చేసిన ఐఆర్‌జీసీ
- మరో పదిరోజులు యుద్ధానికి విరామం : ట్రంప్ ప్రకటన
- ఇజ్రాయిల్ సైన్యం కుప్పకూలే ప్రమాదం : ఐడీఎఫ్ చీఫ్ హెచ్చరిక

**వాషింగ్టన్,టెహ్రాన్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు, హెచ్చరికలను ఇరాన్ ఏ మాత్రం లెక్క చేయట్లేదు. ప్రతిదాడులతో గట్టి సమాధానం చెప్తోంది. టెహ్రాన్‌లో బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. పశ్చిమ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై కూడా దాడులు చేశామని ప్రకటించింది. ఇక ఇరాన్.. యూఎస్ మిత్ర దేశాలపై విరుచుకుపడుతోంది.శుక్రవారం కూడా ఈ దాడులను కొనసాగించింది. బహ్రెయిన్, ఖతార్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై క్షిపణుల్ని ప్రయోగించింది. మరోవైపు పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి.

**అవి అమెరికాకు ఇచ్చిన కానుకలు:ట్రంప్**

ఇరాన్ తన ఇంధన కేంద్రాలు, చమురు నిల్వలపై దాడులను తప్పించుకోవాలంటే చర్చలు ఒక్కటే మార్గమని చెప్పారు. లేకుంటే వారి ఇంధన కేంద్రాలను నేలమట్టం చేస్తామని హెచ్చరించారు. "హార్ముజ్ జలసంధి నుంచి ఎనిమిది చమురు నౌకలను వెళ్లేందుకు ఇరాన్ అనుమతించింది. ఇది అమెరికాకు ఇరాన్ ఇచ్చిన

-మిగతా 2 లో

# ఏప్రిల్ 25న పార్టీ ప్రకటన

**పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా**



- మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన


**నిజామాబాద్,**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు

-మిగతా 2 లో

# ఇండియా స్ఫూర్తితో కృషి చేయాలి

మొదటి తరువాయి




ఆర్థిక, వాణిజ్య స్థిరత్వాన్ని కాపాడుకోవడమే ప్రాధాన్యమని, ప్రజాప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా అంతా పని చేయాలని తెలిపారు. ఎరువుల నిల్వ, పంపిణీపై ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేయాలని రాష్ట్రాల సీఎంలకు మోడీ ఆదేశించారు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, యూపీ, పంజాబ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్నందున ఎన్నికలు జరిగే రాష్ట్రాల సీఎంలు పాల్గొనలేదు. అలాగే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షాలు కూడా పాల్గొన్నారు. కాగా ఎన్నికలు జరిగే ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత చీఫ్ సెక్రెటరీలతో విడిగా క్యాబినెట్ సెక్రెటేరియట్ సమావేశం జరపనుంది. మార్చి 25న ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించి పశ్చిమాసియాలో తలెత్తిన పరిస్థితులను వివరించింది. ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, సవివరమైన ప్రణాళికలను ఆ సమావేశంలో వివరించారు. ఈ ఇంధన సంక్షోభం సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం వుందంటూ ఈ నెల 23న లోక్‌సభలో మాట్లాడుతూ ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో అందరం కలిసి ఎలా ఎదుర్కొన్నామో ఇప్పుడు కూడా దేశం అందుకు సన్నద్ధంగా వుండాలని కోరారు.

# నేటి నుంచి ఐపీఎల్

మొదటి తరువాయి

కనిపిస్తున్నది. పొట్టి ప్రపంచకప్‌తో కోట్లాది మంది అభిమానుల కల నెరవేరిన వేళ ఐపీఎల్ రెట్టింపు క్రేజ్‌తో దుమ్మురేపే అవకాశముంది. శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) జట్ల మధ్య పోరుతో ఐపీఎల్‌కు అధికారికంగా తెరలేవనుంది. గతానికి భిన్నంగా ఈసారి ఎలాంటి ఆరంభ వేడుకలు లేకుండానే ఐపీఎల్ సాదాసీదాగా మొదలుకానుంది.

గతేడాది తొక్కిసలాటలో మరణించిన 11 మందికి నివాళిగా ఈసారి ప్రారంభ కార్యక్రమాన్ని మినహాయించారు. వారికి మద్దతుగా నిలిచేందుకు స్టేడియంలో 11 సీట్లను మృతుల కుటుంబాలకు కేటాయించారు. దీనికి తోడు మ్యాచ్ రోజు ఆర్‌సీబీ ప్లేయర్లంతా 11 నంబర్ జెర్సీ ధరించి ప్రాక్టీస్‌లో పాల్గొననున్నారు. 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడిన ఆర్‌సీబీ మరోమారు అదే ఫీట్‌ను పునరావృతం చేయాలని చూస్తున్నది. పరుగుల వరద పారే అవకాశమున్న చిన్నస్వామిలో సన్‌రైజర్స్‌ను తొలి పోరులో ఎలా ఎదుర్కోవాలనే దానిపై దృష్టి పెట్టింది. స్టార్ బౌలర్ల గైర్హాజరీలో ఇరు జట్లు ఒకింత బలహీనంగా కనిపిస్తున్నా.. బ్యాటింగ్ పరంగా చాలా బలంగా ఉన్నాయి. చిన్నస్వామి ఫ్లాట్ వికెట్‌పై ఈసారి 300 మార్క్ టచ్ అవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓవైపు ఇషాన్ కిషన్, అభిషేక్‌శర్మ, హెడ్, క్లాసెన్‌తో హైదరాబాద్ దుర్భేద్యంగా కనిపిస్తుంటే..కోహ్లీ, డేవిడ్, సాల్ట్, బెతెల్, రజత్, షెఫర్డ్‌తో ఆర్‌సీబీ అంతే పటిష్టంగా ఉంది.

# నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం

మొదటి తరువాయి

నేపాల్ 47వ ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 35 ఏండ్ల షా ఆ పదవి చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ సృష్టించారు. గురువారం ఆయన ప్రతినిధుల సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# హెచ్-1బీ వీసాదారుల వేతనాల పెంపు!

## విదేశీయుల నియామకాలను తగ్గించేందుకే..




**వాషింగ్టన్**

అమెరికాలో పనిచేస్తున్న హెచ్-1బీ వీసాదారులు, ఇతర విదేశీ కార్మికుల వేతనాలు పెంచాలని యోచిస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. అమెరికన్ల ఉద్యోగాలను కాపాడేందుకు ఆ దేశ కార్మిక శాఖ ఈ ప్రతిపాదన చేసింది. ప్రస్తుతం అమెరికన్లకు ఆయా కంపెనీలు తక్కువ వేతనాలు చెల్లించడం, జీతం ఎక్కువ డిమాండ్ చేసిన వారిని ఉద్యోగాల్లోంచి తీసేసి తక్కువ వేతనానికి పనిచేసే వలస కార్మికులను నియమించుకుంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి. దానిని నిరోధించడానికి అమెరికా కార్మిక శాఖ ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.దీని కారణంగా అమెరికా దేశస్థులకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు రావడమే కాక, వారికి ఉద్యోగ భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నది. ఈ కొత్త నిబంధనల ప్రకారం అమెరికాలోని కంపెనీలు హెచ్-1బీ వీసా, కొన్ని రకాల గ్రీన్‌కార్డు విభాగాలకు చెందిన విదేశీ కార్మికులను నియమించుకుంటే వారికి గణనీయంగా అధిక వేతనాలు తప్పనిసరిగా చెల్లించాలి. అమెరికన్ల జీతాలను తగ్గించడాన్ని నిరాకరించే లక్ష్యంతో ట్రంప్ యంత్రాంగం ఈ నిబంధనలను ప్రతిపాదించిందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఈ చర్య విదేశీ కార్మికులకు అమెరికన్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందేలా నిర్ధారిస్తుందని పేర్కొన్నది.

# వృత్తి లైన్ మెన్... ప్రవృత్తి అక్రమ ఇసుక దందా...!

మొదటి తరువాయి

ఇంజిన్ నెంబర్ టీజీ309180 గల ట్రాక్టర్ తో ఇసుక తరలిస్తున్న కృష్ణమూర్తిని పట్టుకున్నారు. అనంతరం అతనిపై అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్. నంబర్ 36/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 303(2)తో పాటు మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ (ఎంఎండీఆర్) చట్టంలోని సెక్షన్ 21(1) కింద కేసు నమోదు చేసి పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను తరలించడం తీవ్ర నేరమని అధికారులు పేర్కొన్నారు.



**పలుమార్లు కేసులు.. చర్యలు మాత్రం శూన్యం..**

అయితే కేసు నమోదు అయినప్పటికీ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగి నేరంలో పట్టుబడినప్పటికీ సస్పెన్షన్ లేదా శాఖాపరమైన చర్యలపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోంది.

**కాసుల మత్తులో అధికారులు నిద్రపోతున్నారా..!**

స్థానికుల సమాచారం ప్రకారం, గతంలో కూడా ఇదే లైన్‌మన్‌పై అనేకసార్లు అక్రమ ఇసుక రవాణా, ఇతర భూ దందాల కేసులు నమోదైనట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులు నమోదు అవుతునప్పటికి మళ్లీ అదే దందాను కొనసాగించడం అతని నిత్యకృత్యంగా మారిందని ఆరోపిస్తున్నారు. అధికారులకు డబ్బులు అందిస్తే కేసులు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రతకు ఎలాంటి ప్రమాదం ఉండదనే ధైర్యంతోనే అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి పరిణామాలు అక్కడ జరుగుతున్న వ్యవస్థపై తీవ్ర అనుమానాలు కలిగిస్తున్నాయి.

**పుష్కలంగా అధికార అండదండలే కారణమా..!**

అక్రమ ఇసుక మాఫియాకు కొందరు అధికారుల అండ ఉందా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి పడుతున్న ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతుండటంతో పాటు వాగులు, నదులు పర్యావరణపరంగా దెబ్బతింటున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూగర్భ జలాల స్థాయి పడిపోవడం, భూక్షయం వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. గతం లో లైన్మెన్ పై నమోదు అయిన కేసుల వివరాలు చూస్తే ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణ చేపట్టాలని, నిందితుడి తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజా ప్రతినిధులు,స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ కార్యకలాపాల్లో పలుమార్లు పట్టుబడిన సదరు లైన్‌మన్‌ను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# సిద్దిపేటపై కాంగ్రెస్ గురి

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మాజీ ముఖ్యమంత్రి కూతురు కల్వకుంట్ల కవిత సైతం సిద్దిపేట నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్, కవిత నూతనంగా ఏర్పాటు చేసే పార్టీ పోటీ పడనున్నాయి. సీఎం వ్యాక్తలు రాజకీయ చర్చకు తెరలేపారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండున్నరేండ్లు గడువు ఉన్నప్పటికీ సిద్దిపేట నియోజకవర్గంలో పోటీపై ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఇప్పటినుంచే సవాళ్లు.. ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. బీఆర్ఎస్ ముఖ్యనేత హరీశ్‌రావు ఈ నియోజకవర్గం నుంచి ఓటమి లేకుండా వరుసగా విజయం సాధిస్తూ బీఆర్ఎస్‌కు కంచుకోటగా మార్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ ఆయన తన పట్టును నిలబెట్టకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏడు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గెలుపులో హరీశ్‌రావుదే కీలక పాత్ర. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లోనూ బీఆర్ఎస్ పట్టు నిలుపుకుంది. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 'సిద్దిపేటలో 35 సంవత్సరాల నుంచి ఒకే కుటుంబానికి అధికారం కట్టబెట్టారు.. ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి' అని ప్రజలను కోరుతూ మంత్రి పదవి ఆఫర్ ఇచ్చి పరోక్షంగా హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. ఇందుకు స్పందించిన హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే సిద్దిపేట నుంచి పోటీకి దిగాలని ప్రతి సవాల్ విసిరారు.

**సిద్దిపేటలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కసరత్తులు..**

సిద్దిపేట నియోజకవర్గంలో ఎలాగైనా హరీశ్‌రావును ఓడించి కాంగ్రెస్ గెలవాలనే లక్ష్యంగా మంత్రి పదవిని నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి ఆశ చూపారు. ఇక ఆ దిశగానే కాంగ్రెస్ పార్టీ కసరత్తులు చేస్తున్నది. ఉమ్మడి జిల్లాలో నారాయణఖేడ్, మెదక్, అందోలు, హుస్నాబాద్‌లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కొనసాగుతున్నారు. దాంతో ఎలాగైనా సిద్దిపేట నియోజకవర్గంలో హరీశ్‌రావును ఓడించాలని మంత్రి పొన్నం పథకం రచిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటనతోనే బహిర్గతమైంది. కాగా, సంగారెడ్డి, సిద్దిపేట, నర్సాపూర్, జహీరాబాద్, దుబ్బాక, పటాన్‌చెరు, గజ్వేల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రితో పాటు పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పాదయాత్ర-శ్రమదానం చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామికి ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించడంతో పాటు సిద్దిపేట, మెదక్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రణాళికలు రచిస్తున్నారు.

# ఏప్రిల్ 25న పార్టీ ప్రకటన

మొదటి తరువాయి

. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లు మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# పెరుగుతున్న ఉద్రిక్తతలు

మొదటి తరువాయి

'కానుక' అని చెప్పుకొచ్చారు.

**ఐక్యరాజ్యసమితికి ఇరాన్ లేఖ**

అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. ఆ రెండు దేశాలవి ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదమని అభివర్ణించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఓ లేఖ రాసింది. తమ దేశ సీనియర్ ఉన్నతాధికారులు, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి, పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాగెర్ ఘాలిబాఫ్‌లను హత్య చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ కుట్ర పన్నాయని ఆ లేఖలో పేర్కొంది. ఈ లేఖను ఐక్యరాజ్యసమితి (యూఎన్) సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, యూఎన్ భద్రతా మండలి అధ్యక్షుడికి యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయ్యిద్ ఇరావని గురువారం అందించారు. ఈ వివరాలతో ఇరాన్ అధికారిక న్యూస్ ఛానల్ ఒకటి వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు ఉద్దేశపూర్వకంగానే ఈ హత్యలకు పాల్పడుతున్నాయని వివరించింది. ఈ విధంగా కుట్రలు చేయడం అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవేళ ఇరాన్ హై ర్యాంకింగ్ అధికారులపై దాడులు జరిగితే, అది శాంతియుత అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. అరబ్ దేశాల తీరుపై కూడా ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా సైన్యానికి సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సహకారాన్ని అందించడం విచారకరమని పేర్కొంది. ఈ అరబ్ దేశాలు అంతర్జాతీయ చట్టాలను కాలరాస్తున్నాయని వివరించింది. సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు అమెరికాకు సైనికపరమైన ఆశ్రయం ఇవ్వడాన్ని ఆపాలని సూచించింది.

# పకడ్బందీగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

మొదటి తరువాయి

పలు అంశాలను ప్రదాని దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాల బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆస్పత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్టు వివరించారు. స్టాక్, రోజువారి వినియోగంపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందనీ, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు,చమురు,గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు సీఎం మోడీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జలమండలిలో జలగలు...
# రూల్స్ కు వ్యతిరేకంగా పైరవీలు

- స్థాన చలనమే తప్ప...లంచాలు మాత్రం ఎక్కడైనా అంతే..
- లంచాలు ఇస్తే ఒక తీరు.. ఇవ్వకుంటే ఇంకొక తీరు..
- ఈ స్థాయిలోనే ఇంత దోచుకుంటే భవిష్యత్ లో ఇంకెంత దోపిడీ..?
- అధికారులకు మడుగులొత్తే రిటైర్డ్ ఉద్యోగులు...
- డీజీఎం కార్యాలయం బయటే తిష్ట...చేపల కోసం వేట...
- నిబంధనలకు విరుద్ధంగా 2026-2-2764 అప్లికేషన్ లో కూడా వీరి మొబైల్ నంబరే...
- పని చేసేది జలమండలిలో బైక్ మీద స్టిక్కర్ జీహెచ్ఎంసీది







**ఎల్బీనగర్, మార్చి 27 (నేటి దర్శిని):** ఎల్బీనగర్ నియోజకవర్గంలో జలమండలి శాఖలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా ఇంటి నల్లా, మురుగు నీటి కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలను కొంతమంది ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. దరఖాస్తుదారుల పేర్లతో అప్లికేషన్ ఫైళ్లు నమోదు చేస్తూ, మొబైల్ నంబర్ల స్థానంలో సర్కిల్-6 మన్సూరాబాద్ సివరేజ్ సూపర్వైజర్ ఉప్పరి హుస్సేన్ నంబర్ నమోదు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అప్లికేషన్‌కు సంబంధించిన సమాచారం అసలు దరఖాస్తుదారులకు అందకుండా, మధ్యవర్తుల ద్వారా లావాదేవీలు జరిగే పరిస్థితి నెలకొంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కేతావత్ సక్రు నాయక్ పై కూడా పలు ఆరోపణలు ఉన్నాయి. జలమండలిలో పనిచేస్తూనే, జీహెచ్ఎంసీ స్టిక్కర్ ఉన్న ద్విచక్ర వాహనంతో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ప్రజలు చెబుతున్నారు. గతంలో అధిక డబ్బులు డిమాండ్ చేయడం, దుర్భాషలాడటం వంటి ఆరోపణలతో డివిజన్-11 నుండి డివిజన్-5 లింగోజిగూడ సెక్షన్‌కు బదిలీ అయినప్పటికీ, అతని వ్యవహారశైలి మారలేదని తెలుస్తోంది. సర్కిల్-6 హయత్‌నగర్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద తరచూ తిరుగుతూ, కొత్త కనెక్షన్ల కోసం వచ్చే ప్రజలను లక్ష్యంగా చేసుకొని "ఫైల్ నేను చేస్తా" అంటూ అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులతో తనకు పరిచయం ఉందని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నాడని సమాచారం. ఇదిలా ఉండగా, జలమండలిలో పనిచేసి రిటైర్డ్ అయిన కొంతమంది ఉద్యోగులు కూడా కార్యాలయాల వద్దే తిష్ట వేసి పైరవీలు చేస్తూ, కనెక్షన్ల కోసం లంచాలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ లావాదేవీల్లో కొంతమంది అధికారులకు కూడా వాటాలు వెళుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "లంచం ఇస్తే ఒక తీరు, ఇవ్వకపోతే ఇంకో తీరు" అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థాయిలోనే దోపిడీ కొనసాగితే భవిష్యత్‌లో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత సిబ్బందిపై నిఘా పెట్టి, బ్యాంకు మరియు ఆర్థిక లావాదేవీలను పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దరఖాస్తుదారులకు పారదర్శకంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మిడ్జిల్ మండలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు..






**మిడ్జిల్, మార్చి27 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల పరిధిలో గల గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా జరిగాయి. గ్రామ గ్రామాన గల రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవంను నిర్వాహకులు అత్యంత భక్తిశ్రద్ధలత, వైభవంగా జరిపించారు. రాముడు సీతమ్మను మనువాడిన ఘట్టాన్ని గ్రామస్తులంతా కనులార తిలకించారు. శ్రీరామనవమిగా పిలువబడే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను చాటడమే కాకుండా, రాముని ఆదర్శాలను గుర్తుచేస్తూ ఆధ్యాత్మికతతో గ్రామాలన్నీ పులకించిపోయాయి. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రామాలయ ప్రాంగణాలలో గల చలువ పందిరిలలో భక్తులకు పులిహోర , అన్నదానం కార్యక్రమం, బెల్లం పానకాలను నిర్వాహకులు



ఏర్పాటు చేశారు .

## మార్కండేయ దేవాలయంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం...

**ఆమనగల్,మార్చి27(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో శుక్రవారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం ఆలయ అర్చకుడు విజ్ఞేయ శర్మ ఆధ్వర్యంలో అన్ని పూజా కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. ఆలయాన్ని పచ్చటితోరణాలతో, విద్యుత్ దీపాలతో, కాషాయపు జెండాలతో, వివిధ రకాల పూలమాలలతో, సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి కల్యాణాన్ని అప్పం రాఘవేంద్ర, అప్పం శ్రీనివాసులు జరిపించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు రెండు రోజుల నుండి పూజ కైంకర్యాలను ఘనంగా జరిపించారు.దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు చలువ పందిళ్ళను వేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. కళ్యాణం అనంతరం దేవాలయ ప్రాంగణంలోభక్తులకు తీర్థప్రసాదాలు అలాగే అన్న ప్రసాద వితరణ పంపిణీ చేశారు. దేవాలయ ప్రాంగణానికి మహిళా భక్తులు



పోటెత్తారు. సీతరాముల వారి కళ్యాణం కనులారా వీక్షించడానికి వివిధ గ్రామాల నుండి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పం తిరుపతయ్య, చెరుకు నరసింహ,భావండ్ల భాస్కర్, గాజుల సత్యరాములు,కోట అశోక్,గుర్రం కేశవులు, భావండ్ల శంకరయ్య,చెరుకు రవి, కోట చిన్న అశోక్ ,గుద్దేటి మహేష్ నేత, మామిడిశెట్టి రవి,ఎంగలి యాదగిరి, శ్రీధర్, రఘు,రమేష్,ప్రసాద్, బికుమాండ్ల శ్యాంసుందర్,ఏలే శివకుమార్,గుర్రం సుధీర్, మసన మురళీధర్, చెర్కు తిరుమలేష్, పున్న శ్రీను కిరాణం, గుజ్జరి శ్రీను,పట్టణ ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యం

- పెట్రో ధరల తగ్గింపుపై బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హర్షం




బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్, మార్చి27 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యం గా ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాలు తీసుకుంటారని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇంధన సంక్షోభం సమయం లోనూ దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పెట్రోల్,డీజిల్ పై 10 రూపాయల సుంకం తగ్గించడం చరిత్రాత్మకం అన్నారు.పశ్చిమాసియా యుద్ధం సందర్భంగా మిగతా ప్రపంచ దేశాల్లో ధరలు పెంచితే ప్రధాని నరేంద్రమోడీ మాత్రం దేశ ప్రజల సంక్షేమ మే లక్ష్యంగా పెట్రోల్ డీజిల్ ధరలు 10 రూపాయలు తగ్గించారని అన్నారు. ఇది రానున్న రోజుల్లో భారత్ విశ్వగురు కావడానికి నిదర్శనమని అన్నారు. ఇది సామాన్యం ప్రజలకు ఎంతో ఉపశమమనిఅన్నారు.సంక్షోభ సమయంలో పెట్రో ధరలు తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీ కి,కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆమనగల్ 11వ వార్డు లో సీసీ రోడ్డు పనులకు ప్రారంభోత్సవం....

- ముఖ్య అతిథిగా విచ్చేసిన తల్లోజు ఆచారి..




**ఆమనగల్, మార్చి27(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని11వ వార్డు ఆదర్శనగర్ లో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాయక్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముక్తాల వెంకటయ్య,శ్రీశైలం యాదవ్,రాంపాల్ నాయక్, మానయ్య,రవి రాథోడ్, గోజే ఆనంద్,ఎండి అబ్దుల్ రహీం,కరీం,సర్పంచ్ ఎం.రాములు, పెద్దయ్య, చెరుకు యాదగిరి,భావండ్ల వెంకటేష్, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# న్యాయస్థానాల తీర్పులు రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి ఉండాలి

- కోర్టు తీర్పులు ఎస్సీ ల మతసేచ్ఛను హరిస్తున్నాయా !
- ఆర్టికల్ 15 ప్రకారం కేవలం మతం ప్రాతిపదికన వివక్ష చూపడం రాజ్యాంగ విరుద్ధం.
- ఆర్టికల్ 14 సమానత్వపు హక్కుకు పూర్తి విఘాతం.
- రాజ్యాంగం ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా కల్పించింది.
- ఎస్సీ లపై మాత్రమే ఎందుకు ఈ మత వివక్ష




భారత రాజ్యాంగం పీఠికలో పేర్కొన్న 'లౌకిక' (Secular) అనే పదం మన దేశ ఆత్మ. లౌకిక దేశం అంటే రాజ్యానికి స్వంత మతం ఉండదు మరియు రాజ్యం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుంది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులలో 'మత స్వేచ్ఛ' అత్యంత కీలకమైనది. ఆర్టికల్ 25 ప్రకారం, ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రభోదానుసారం ఏ దైవాన్నైనా ప్రార్థించుకోవచ్చు లేదా ఏ మత విశ్వాసాన్నైనా అనుసరించవచ్చు. అయితే, లౌకిక దేశంలో ఈ ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది ఒక వ్యక్తి యొక్క సామాజిక గుర్తింపును, ముఖ్యంగా తరతరాలుగా వస్తున్న 'కులం' అనే చారిత్రక ముద్రను చెరిపివేయగలదా? అన్నదే నేటి సామాజిక మరియు న్యాయపరమైన మథనం.మార్చి 24 న సుప్రీం కోర్టు తీర్పు పై మతం మారిన వారి ఎస్సీ (SC) హోదాపై జరుగుతున్న చర్చలు, రాజ్యాంగంలోని సమానత్వపు హక్కులకు మరియు క్షేత్రస్థాయి సామాజిక వాస్తవాలకు మధ్య ఉన్న సంబంధాన్ని మరోసారి విశ్లేషించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

**లౌకికవాదం మరియు రాజ్యాంగ రక్షణలు:**
మన దేశం లౌకిక దేశం అని చెప్పడానికి ఆర్టికల్ 14, 15, 16 మరియు 25 లే ప్రధాన నిదర్శనాలు. ఆర్టికల్ 15(1) స్పష్టంగా చెబుతోంది: "రాజ్యం ఏ పౌరుడి పట్ల కేవలం మతం, జాతి, కులం, లింగం లేదా పుట్టిన స్థలం ప్రాతిపదికన వివక్ష చూపకూడదు." మరి ఎస్సీ హోదాను కేవలం 'మతం' ప్రాతిపదికన నిరాకరించడం లౌకికవాద స్ఫూర్తికి విరుద్ధం కాదా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒక వ్యక్తి హిందూ మతంలో ఉన్నప్పుడు ఎస్సీగా ఉండి, తన ఆధ్యాత్మిక విశ్వాసాన్ని మార్చుకుని క్రైస్తవం లేదా ఇస్లాం స్వీకరించిన వెంటనే ఆ సామాజిక రక్షణలను కోల్పోవడం అనేది, లౌకిక రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛపై పరోక్షంగా ఒత్తిడి తెచ్చినట్లు అవుతుందనే వాదన బలంగా ఉంది.

**న్యాయపరమైన నేపథ్యం, తీర్పులు – వాస్తవాలు:**
గతంలో Soosai vs Union of India వంటి కేసుల్లో న్యాయస్థానాలు "క్రైస్తవం లేదా ఇస్లాం మతాల్లో అస్పృశ్యత లేదు కాబట్టి, ఆ మతాల్లోకి మారిన వారు ఎస్సీ హోదాను కోల్పోతారు" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. కానీ, దీనికి బలమైన కౌంటర్ వాదన సామాజిక వాస్తవికత (Social Reality) నుండి వినిపిస్తోంది. అనేక కమిషన్ల నివేదికల ప్రకారం---మతం మారిన తర్వాత కూడా సదరు వ్యక్తుల ఆర్థిక స్థితిగతులు గానీ, సమాజం వారిని చూసే వివక్షాపూరిత దృష్టి గానీ ఏమాత్రం మారలేదు.


ఈ సందర్భంలో స్టేట్ ఆఫ్ కేరళ జం చీ.వీ. థామస్ కేసులో కోర్టు వెల్లడించిన అభిప్రాయం గమనార్హం. "రిజర్వేషన్లు అనేవి కేవలం కులం ఆధారంగా ఇచ్చేవి కావు, అవి ఒక వెనుకబడిన వర్గానికి ఇచ్చే రక్షణలు" అని కోర్టు పేర్కొంది. లౌకిక దేశంలో ఒక వర్గం ఇంకా వెనుకబాటుతనంలోనే ఉంటే, వారి ఆధ్యాత్మిక విశ్వాసంతో సంబంధం లేకుండా వారికి రాజ్యాంగ రక్షణలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం.

**"సోషల్ స్టిగ్మా" (సామాజిక మచ్చ) – మతమార్పిడితో మాయని గాయం:**
భారతీయ సామాజిక ముఖచిత్రంలో కులం అనేది కేవలం ఒక మతపరమైన అంశం కాదు; అది పుట్టుకతో సంక్రమించే ఒక సామాజిక హోదా. దీనినే సామాజిక శాస్త్రవేత్తలు Social Stigma that out-lives Conversion అని పిలుస్తారు. అంటే, మతమార్పిడి అనేది ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక విశ్వాసాన్ని మార్చవచ్చు కానీ, సమాజం అతని పట్ల చూపే వివక్షను మార్చలేదు.ఒక దళిత క్రైస్తవుడు లేదా ముస్లిం ఆధ్యాత్మికంగా కొత్త మార్గాన్ని ఎంచుకున్నప్పటికీ, సమాజంలో అతను ఎదుర్కొనే సామాజిక అడ్డంకులు అలాగే కొనసాగుతున్నాయి. చారిత్రక వెనుకబాటుతనం అనేది ఒక మతం నుండి మరొక మతానికి మారినంత మాత్రాన ఏదో తక్షణ పరివర్తన జరిగిపోయి, రాత్రికి రాత్రే సామాజిక హోదా మారిపోదు. ఇతర మతాలు సమానత్వాన్ని బోధించినా, భారతీయ సామాజిక వ్యవస్థలోని కుల వ్యవస్థ ఆ మతాల్లోకి కూడా చొచ్చుకుపోయింది. అందుకే నేడు "దళిత క్రైస్తవులు" లేదా "దళిత ముస్లింలు" అనే సామాజిక గుర్తింపులు ఆయా వర్గాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రతిబింబిస్తున్నాయి.

**రాజ్యాంగ వైరుధ్యాలు:**
రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 "చట్టం ముందు అందరూ సమానమే" అని స్పష్టం చేస్తోంది. ఇక్కడ మనం గమనించాల్సిన ప్రధాన వైరుధ్యం (Constitutional Paradox) ఏమిటంటే ఒకే సామాజిక నేపథ్యం నుండి వచ్చిన ఇద్దరు వ్యక్తులలో ఒకరు బౌద్ధమతాన్ని స్వీకరిస్తే అతనికి ఎస్సీ హోదా లభిస్తోంది. అదే సామాజిక నేపథ్యం కలిగిన మరొక వ్యక్తి క్రైస్తవ లేదా ఇస్లాం మతాన్ని స్వీకరిస్తే అతనికి ఆ హోదా నిరాకరించబడుతోంది.
ఇది రాజ్యాంగం నిషేధించిన "విచక్షణారహిత వర్గీకరణ" (Arbitrary Classification) పరిధిలోకి వస్తుంది. సామాజిక న్యాయం మరియు రిజర్వేషన్లు అనేవి కుల వృత్తులు, సామాజిక అణచివేత మరియు చారిత్రక వెనుకబాటుతనం ప్రాతిపదికన ఉండాలి తప్ప, కేవలం వ్యక్తిగత ఆధ్యాత్మిక విశ్వాసాలపై ఆధారపడకూడదు.

**సామాజిక న్యాయం:**
న్యాయశాస్త్రం (Jurisprudence) ప్రకారం, "చట్టం అనేది సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉండాలి". ఎస్సీ రిజర్వేషన్ల ప్రధాన ఉద్దేశ్యం వేల ఏళ్లుగా జరిగిన సామాజిక అన్యాయాన్ని (Historical Injustice) సరిదిద్దడం. మతం మార్చుకున్నంత మాత్రాన ఆ వేల ఏళ్ల అన్యాయం యొక్క ప్రభావం (Legacy of discrimination) పోదు. 1950 నాటి 'షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వు' కాలక్రమేణా సిక్కు మరియు బౌద్ధ మతాలకు విస్తరించబడింది. దీని వెనుక ఉన్న హేతువు---ఆ మతాల్లోకి మారినా సరే వారి సామాజిక స్థితిలో మార్పు రాలేదని గుర్తించడమే. మరి ఇదే సామాజిక శాస్త్రీయ దృక్పథం ఇతర మతాల్లోని వెనుకబడిన వర్గాలకు ఎందుకు వర్తించకూడదు?రిజర్వేషన్లు అనేవి ప్రభుత్వ పాలనలో మరియు ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం (Adequate Representation) కల్పించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ రక్షణలు. ఒక వ్యక్తి తన ప్రార్థనా పద్ధతిని మార్చుకున్నంత మాత్రాన అతని సామాజిక వర్గం యొక్క ప్రాతినిధ్యం పెరగదు. సామాజిక హోదాను మతంతో విడదీయలేని విధంగా ముడిపెట్టడం వల్ల, రాజ్యాంగం ఆశించిన సామాజిక న్యాయం నిజమైన లబ్ధిదారులకు చేరడంలో అడ్డంకులు ఏర్పడుతున్నాయి.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని స్వీకరించడానికి, ఆచరించడానికి మరియు ప్రచారం చేసుకోవడానికి రాజ్యాంగం ఒక పరమ పవిత్రమైన ప్రాథమిక హక్కును కల్పించింది, అయితే ఈ అంతరాత్మ ప్రబోధంతో కూడిన మత స్వేచ్ఛ అనేది కేవలం ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక విశ్వాసానికి సంబంధించింది తప్ప అతని సామాజిక రక్షణలను హరించే సాధనం కాకూడదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం రాజ్యం ఏ పౌరుడి పట్ల కేవలం మతం ప్రాతిపదికన వివక్ష చూపకూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ, మార్చి 24 నాటి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేవలం మతం మారారనే నెపంతో ఎస్సీ సామాజిక రక్షణలను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా కనిపిస్తోంది. ఎందుకంటే మతమార్పిడి అనేది ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక శాంతిని ఇవ్వగలదు కానీ, శతాబ్దాలుగా సమాజం అతనిపై వేసిన వివక్షాపూరిత 'కుల ముద్ర'ను (Social Stigma) ఏమాత్రం చెరిపివేయలేదు, కాబట్టి బౌద్ధ మరియు సిక్కు మతాల్లోని దళితులకు వర్తించే ఎస్సీ హోదాను అదే సామాజిక నేపథ్యం కలిగిన క్రైస్తవ మరియు ముస్లింలకు నిరాకరించడం ఆర్టికల్ 14 ద్వారా లభించే సమానత్వపు హక్కుకు పూర్తి విఘాతం కలిగిస్తోంది. రాజ్యాంగం అనేది ఒక సజీవ దస్తావేజు కాబట్టి, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే క్రమంలో మతం అనేది అడ్డుగోడ కాకుండా అట్టడుగు వర్గాలకు అండగా నిలవడమే నిజమైన సామాజిక న్యాయం.

**విశ్లేషకులు:**
–యేకుల సురేష్. M.A,B.Ed,LLB
సామాజిక విశ్లేషకులు
9966102987



## రైతుల పట్ల ప్రభుత్వం బాధ్యతతో ఉంది: ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

- శివన్నగూడెం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ. 3.04 కోట్ల నష్టపరిహారం పంపిణీ
- ప్రాజెక్టుల వల్ల ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం.





**చింతపల్లి, మార్చి 27 ( నేటి దర్శిని):**
శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వర్కాల గ్రామ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం చింతపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూనిర్వాసితులకు ఆయన నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. వర్కాల గ్రామానికి చెందిన సర్వే నంబర్ 73 పరిధిలో భూములు కోల్పోయిన 15 మంది రైతులకు మొత్తం రూ. 3,04,50,000 (మూడు కోట్ల నాలుగు లక్షల యాభై వేల రూపాయల) విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతులు అందుకున్న ఈ నష్టపరిహారాన్ని వృథా చేయకుండా, తమ కుటుంబ భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం మొత్తం సస్యశ్యామలం అవుతుందని, రానున్న మూడేళ్లలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల వల్ల ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి సౌకర్యం కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**పాల్గొన్న అధికారులు, నాయకులు:**
ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణా రెడ్డి, ఎమ్మార్వో విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు ముచ్చర్ల గిరి, పవన్, వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు. అలాగే చింతపల్లి సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్, వర్కాల సర్పంచ్ కుర్మేటి పుష్పలత ప్రశాంత్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులైన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రపంచ రంగస్థలం దినోత్సవం సందర్భంగా

- సన్మానం చేసిన గ్రామ సర్పంచ్ టి.చంద్రయ్య గౌడ్



**మిడ్జిల్, 27, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామానికి చెందినరంగస్థలం నటలో ఆనెగళ్ళ బిక్షపతి రంగస్థలం మీద వివిధ పాత్రలు పోషించారు అలాగే గుత్తి రమేష్ వివిధ పాత్రలు పోషించారు అదేవిధంగా మాదారం నరసింహ నటుడు మరియు నాటక రంగంలో అధ్యాపకునిగా కొనసాగుతున్నారు వీరికి వాడియాల గ్రామ సర్పంచ్ తీర్మాందాస్ చంద్రయ్య గౌడ్ ఉప సర్పంచ్ నాగరాజు మాజీ సర్పంచులు మరియు గ్రామ పెద్దలు యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు


# నకిలీ నీటి ట్యాంకర్లతో నగరంలో నయా మోసం

- నీటి కొరతను ఆసరాగా చేసుకున్న మోసగాళ్లు
- జలమండలి పేరుతో నకిలీ బుకింగ్‌ల మాయాజాలం
- ముందస్తు చెల్లింపులతో ప్రజల మోసం
- అనధికార ట్యాంకర్లపై అధికారుల కఠిన హెచ్చరిక
- మోసగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు ఖాయం
- విజిలెన్స్ బృందాల దాడులతో అక్రమాల కట్టడి
- అధికారిక మార్గాల ద్వారానే ట్యాంకర్ బుకింగ్ చేయాలి
- అప్రమత్తతే మోసాలకు చెక్ పెట్టే ప్రధాన ఆయుధం




**హైదరాబాద్, మార్చి27: (నేటి దర్శిని):**
హైదరాబాద్ నగరంలో నీటి కొరతను అవకాశంగా మలుచుకున్న మోసగాళ్లు ట్యాంకర్ బుకింగ్ పేరుతో ప్రజలను బలితీసుకుంటున్నారు. జలమండలి పేరును అడ్డంగా పెట్టుకుని నకిలీ ట్యాంకర్లతో డబ్బులు వసూలు చేస్తూ దందా సాగిస్తున్నారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రజలను మభ్యపెట్టి ముందస్తు చెల్లింపులు తీసుకుని పరారవుతున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మోసాలపై అప్రమత్తమైన జలమండలి అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అధికారిక అనుమతి లేకుండా ట్యాంకర్లు నడపడం, బుకింగ్‌లు స్వీకరించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే నష్టపోవాల్సిందేనని అధికారులు సూచిస్తున్నారు. గుర్తింపు లేని వ్యక్తులకు డబ్బులు చెల్లించడం, అనధికార నంబర్ల ద్వారా ట్యాంకర్లు బుక్ చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. జలమండలి అధికారిక వెబ్‌సైట్ లేదా గుర్తింపు పొందిన సేవల ద్వారానే బుకింగ్ చేయాలని స్పష్టం చేశారు. నీటి కొరత తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ మోసాలు మరింత విస్తరిస్తుండటంతో విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. నకిలీ ట్యాంకర్లపై దాడులు నిర్వహిస్తూ, అక్రమ కనెక్షన్లపై కేసులు నమోదు చేస్తూ కట్టడి చర్యలు ప్రారంభించాయి. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టాలంటే ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని అధికారులు చెబుతున్నారు. అనుమానాస్పద ట్యాంకర్లు లేదా వ్యక్తులపై వెంటనే సమాచారం అందించాలని కోరుతున్నారు. లేదంటే "నీళ్ల కోసం ఇచ్చిన డబ్బు... మోసగాళ్ల జేబుల్లోకి పోతుంది" అన్న హెచ్చరిక ఇప్పుడు నగరంలో గట్టిగా వినిపిస్తోంది.

## మంథని గోదావరి తీరంలో గల రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు



**మంథని,మార్చి 27: (నేటి దర్శిని):**
మంథని పట్టణంలోని గోదావరి తీరంలో గల కోదండ రామాలయంలో శుక్రవారం రోజున శ్రీరాముని కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.శ్రీరాముడు జన్మించిన చైత్ర శుద్ధ నవమిరోజున కళ్యాణం నిర్వహించడం సాంప్రదాయం.ఈ కార్యక్రమంలో మంథని పట్టణ అన్ని గ్రామాల,ప్రజలు భక్తి,శ్రద్ధలతో పుణ్య కార్యాన్ని తిలకించారు.అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు..

# భూమి కోల్పోయిన వారికి పరిహార చెక్కుల పంపిణీ

● దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్





**చింతపల్లి, మార్చి 27నేటి దర్శిని ప్రతినిధి :**
చింతపల్లి మండలం వర్కల గ్రామానికి చెందిన భూమి కోల్పోయిన 17 మందికి పరిహార చెక్కులను దేవరకొండ ఎమ్మెల్యే మరియు దేవరకొండ ఆదాయ విభాగ అధికారి సంయుక్తంగా పంపిణీ చేశారు. చర్లగూడెం పునరావాస కేంద్రం కోసం సుమారు 20 ఎకరాలు 12 గుంటల భూమిని స్వచ్ఛంద ఒప్పంద పద్ధతిలో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూమి కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పునరావాసం కల్పించడంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముచ్చర్లపల్లిలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

● పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి దంపతులు



**మిడ్జిల్, మార్చి27 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ఉర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పెద్దలు కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సీతా రాముల కళ్యాణ మహోత్సవంలో ముచ్చర్ల జనార్దన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లా డుతూ... ప్రజలందరికీ శ్రీరామనవమి శు భాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక విలువలు నెలకొనాలని ఆకాంక్షించారు. కల్యాణోత్సవం సందర్భంగా నిర్వాహ కులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ముచ్చర్ల జనార్దన్ రెడ్డి దంపతులను నిర్వాహకులు శాలువాతో సన్మానిం చారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

# క్రీడలతో యువతకు దిశ





● ఎమ్మెల్యే బాలునాయక్



**చింతపల్లి, మార్చి 27 నేటి దర్శిని ప్రతినిధి :**
చింతపల్లి మండలం మొద్దుల మల్లేపల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా సర్పంచ్ ముద్దం మల్లేష్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌ల ద్వారా గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదిక లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. శ్రీరామ నవమి మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, శ్రీరాముని ఆదర్శాలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొంటున్న జట్లకు శు భాకాంక్షలు తెలియజేసి క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, మండల అధ్యక్షుడు నాగభూషణం, ముచర్ల గిరి, వెంకటయ్య గౌడ్, రవిశంకర్ రెడ్డి, హరినాయక్, జంగిటి నర్సింహా, మల్లేష్ యాదవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కల్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మార్చి27 (నేటి దర్శిని):**
శ్రీరామనవమి సందర్భంగా హయత్ నగర్ పాత హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి, కల్లెం నవీన్ రెడ్డి దంపతులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినం మనకు ధర్మం, నీతి, సత్యం మార్గంలో నడిచేలా ప్రేరణనిస్తుందని తెలిపారు. శ్రీ రాముడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలో మంచి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సీతారాముల ఆశీస్సులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్లమెంటులో నాగర్ కర్నూల్ అభివృద్ధి కొరకు గలమెత్తిన ఎంపీ మల్లు రవి....



**ఆమనగల్లు, మార్చి 27(నేటి దర్శిని ప్రతినిధి):**
నాగర్ కర్నూల్ పార్లమెంట్ ప్రజల అభివృద్ధి కోసం పార్లమెంటు సమావేశాలలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి మాట్లాడారు. నాగర్ కర్నూల్ భవిష్యత్తును మార్చే దిశగా పార్లమెంటులో కీలక డిమాండ్లు కేంద్ర ప్రభుత్వం ముందు ఎంపీ మల్లు రవి ఉంచి ప్రభుత్వాన్ని ఆకట్టుకున్నారు. తన నియోజకవర్గాన్ని దేశంలోని ఒక ఆదర్శ పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ఆయన ఆర్థిక మంత్రి గారికి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక విప్లవానికి పునాది వేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక అధ్యయనం చేసి భారీ పరిశ్రమలను నాగర్ కర్నూల్ లో ఏర్పాటు చేయాలని, అవసరమైతే హైదరాబాదులో ఉన్న పరిశ్రమలను ఇక్కడికి విస్తరించాలని పరిశ్రమల శాఖ మంత్రి ని కోరారు. అలాగే ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రీజినల్ రింగ్ రోడ్ వల్ల కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని ఇది పెట్టుబడులకు గేట్ వేగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. వెనకబడిన మా ప్రాంతానికి ఒక అవకాశం ఇవ్వండి అని నాగర్ కర్నూల్ ను అభివృద్ధి పథంలో నడిపించండి అంటూ మంత్రులను మల్లురవి కోరారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఉపాధి అవకాశాలతో కళకళలాడే ప్రాంతంగా మారే దిశగా అడుగులు వేస్తుందని మల్లు రవి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం



**యాచారం, మార్చి 27(నేటి దర్శిని):**
భక్తజన సందోహం నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధలతో ఆద్యంతం అలరించింది. నల్లవెల్లి బొగ్గుల గుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గండికోట యాదయ్య, డైరెక్టర్ల ఆధ్వర్యంలో భక్తజన సందోహం నడుమ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు. మంత్రోచ్ఛరణాల నడుమ, డోలు వాయిద్యాల చప్పుళ్లతో అర్చకులు సీతారాముల వివాహం జరిపించారు. కళ్యాణ మహోత్సవాలను తిలకించేందుకు ఉదయం నుంచి భక్తజనం బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తజన సందోహానికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో సర్పంచ్ సభవత్ లలిత కిషన్ నాయక్, ఉపసర్పంచ్ కాసాని రవి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్, పొనగంటి భాగ్యమ్మ మోహన్, ఓరుగంటి యాదయ్య గౌడ్ ఇతరులతోపాటు భక్తజన సందోహం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తిప్పర్తిలో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

● పాల్గొన్న మాజీ జడ్పిటిసి పాశం రాం రెడ్డి




**తిప్పర్తి, మార్చి27 (నేటి దర్శిని):**
శ్రీరామనవమి సందర్భంగా తిప్పర్తి గ్రామ పంచాయితీ పరిధిలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం మరియు రైతు వేదికలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, గ్రామ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్లు గుండ సత్యనారాయణ, జాకటి మోష, మాజీ ఎంపీటీసీలు పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, ఉపసర్పంచ్ నూకల దేవకమ్మ సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అదిములం ప్రశాంత్, తండు సతీష్ గౌడ్, గుండు శ్రీను, వార్డ్ మెంబర్లు తుమ్మల నాగరాజు, కిన్నెర రవి, చింతకుంట్ల మధు, గుండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

- వల్మీడీసీతారామచంద్రస్వామి కి తలంబ్రాలు సమర్పించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- జనగామలోశ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి
- వరంగల్ నగరంలో సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి







**ఉమ్మడి వరంగల్, మార్చి 27(నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో శ్రీరామనవమి పురస్కరించుకొని వివిధ జిల్లాలలో, పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాల్లో వాడవాడలా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓరుగల్లు నగర వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు కనుల పండుగగా జరిగాయి. కిలా వరంగల్, రంగసాయిపేట, శివనగర్, కాశిబుగ్గ, హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాలలోని ఆలయాలలో వేలాది మంది భక్తుల జయ ద్వానాల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోప్తంగా నిర్వహించారు. పచ్చని పందిళ్లు ఆధ్యాత్మిక శోభతో కళ్యాణ మండపాలు కళ కళ లాడాయి.అనంతరం భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నగరమంతా రామనామ స్మరణతో మారు మోగింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో స్వయంభు సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తలంబ్రాలు తీసుకొని వచ్చి స్వామివారికి సమర్పించారు. తెలంగాణలో రెండో భద్రాదిగా పిలువబడే వల్మీడీ సీతారామచంద్ర స్వామికి గుట్టపైన ఇటీవల ఆధునిక అంగులతో దేవాలయం నిర్మించారు. రాత్రి వేళలో విద్యుత్ దీపాలతో కళకళ లాడుతుంది. అలాగే జనగామ పట్టణ కేంద్రంలోని పలు వార్డులలో నిర్వహించిన సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని, సీతారాముల ఆశీస్సులు అందుకున్నారు .పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకలను సందర్శిస్తూ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్ నగరంలోని వివిధ దేవాలయాల్లో సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరాముని ఆశీర్వచనాలు పొందారు.

## శ్రీరామనవమి వేడుకల్లో సుబ్బారు సందీప్ కుమార్ దంపతులు

- ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన సందీప్ కుమార్





**చంపాపేట్ మార్చి 27 (నేటి దర్శిని):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గా నగర్ కాలనీ ప్రజలందరికీ ప్రముఖ వ్యాపారవేత్త, సందీప్ అండ్ కో, కేకే కన్స్ట్రక్షన్స్ అండ్ ఇంటీరియర్స్ అధినేత సుబ్బారు సందీప్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుర్గా నగర్ కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని కోరుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా దుర్గా నగర్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో సుబ్బారు సందీప్ కుమార్ సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## మల్కిజ్ గూడ లో వైభవంగా సీతారాముల కళ్యాణం



**యాచారం, మార్చి 27,(నేటిదర్శిని):** శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా యాచారం మండలం మల్కిజ్ గూడా గ్రామంలోనీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ దేరంగుల శంకర్ ,మాజీ ఉప సర్పంచ్ లింగారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించేందుకు గ్రామ ప్రజలు భక్తుల మధ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డమోని శిరీష వెంకటేష్, వరికుప్పల సుధాకర్, అనంత రెడ్డి , మాజీ సర్పంచ్ లు మల్లేష్, రాజు, చీర యాదమ్మ, నాయకులు వెంకట్ రెడ్డి, నరేష్,శేఖర్, అబ్బాయ్య, గవలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రామ్ చరణ్ పుట్టినరోజు

- 'రెడీ టు సెర్వ్' వృద్ధాశ్రమానికి చిరంజీవి సాయం
- వృద్ధులకు ఆహారం వడ్డించి, వారికి కొత్త బట్టలు పంపిణీ చేసిన చిరంజీవి
- చిరంజీవి విరాళం వృద్ధశ్రామానికి శాశ్వత స్థలం ఏర్పాటుకు వినియోగిస్తామన్న నిర్వహకులు






**హైదరాబాద్, మార్చి27 (నేటి దర్శిని):** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు జుబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఘనంగా జరిగాయి. తన తనయుడు చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ఈ వేడుకలను నిర్వహించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిరంజీవి తన ఉదారతను చాటుకున్నారు.ఈ వేడుకల సందర్భంగా చిరంజీవి 'రెడీ టు సెర్వ్' (=ముసంఎ ˉశీ జావతీజవ) వృద్ధాశ్రమానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆశ్రమ నిర్వాహకులు పెద్ది శంకర్ కు అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు చరణ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త బట్టలు పంపిణీ చేయడంతో పాటు, వారికి ప్రత్యేకంగా భోజనాన్ని స్వయంగా వడ్డించారు. వృద్ధులకు సేవ చేయడంలో 'రెడీ టు సెర్వ్' సంస్థ చూపిస్తున్న చొరవను చిరంజీవి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు పెద్ది శంకర్ చేస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.మెగాస్టార్ చిరంజీవి తమ ఆశ్రమానికి అందించిన విరాళం, మద్దతు పట్ల నిర్వాహకులు పెద్ది శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చరణ్ పుట్టినరోజున తమ ఆశ్రమంలోని వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు నింపడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మరెందరో వృద్ధులను చేరదీసే క్రమంలో వృద్ధశ్రామానికి శాశ్వత నివాస స్థలం ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఇందులో భాగంగా చిరంజీవి అందించిన ఈ సొమ్మును అందుకోసం వినియోగిస్తామన్నారు. దాతలు ముందుకు వచ్చి వృద్ధశ్రామానికి చేయుతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**యాచారం, మార్చి 27,(నేటిదర్శిని):** శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కమనీయంగా నిర్వహించారు. వేదమంత్రాలు తలంబ్రాల వేడుకతో ఉత్సవాలు రమణీయంగా జరిగాయి.గ్రామంలో రామనామ స్మరణం మార్మోగింది. భక్తుల ప్రజల జయ జయ ద్వానాల మధ్య సీతారాముల పరిణయం కన్నుల పండుగగా జరిగింది. పరిణయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయగా అర్చకుల వేదమంత్రోచ్చరణాల నడుమ వాయిద్యాల నడుమ రాములోరి కల్యాణంలో భక్తజన సందోహం కిక్కిరిసిపోగా పరిణయాన్ని, తలంబ్రాల కార్యక్రమాన్ని తిలకించేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉత్సవాలు భక్తులు ప్రజలకు ప్రత్యేక శోభను కలిగించాయి. ఉత్సవాల అనంతరం ప్రజలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలను పుష్పలత బుచ్చిరెడ్డి,మంజుల రామ్ రెడ్డి, ప్రసన్న శ్రీనివాస్ రెడ్డి,విమల మేఘనాథ్ రెడ్డి భక్తజన సందోహం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి వేడుకల్లో కృష్ణ గోపాల్ సేవా సమితి



- బాటసారులకు చల్లటి నీటి పంపిణీ
- వనస్థలిపురంలో రామనవమి సందర్భంగా సేవా కార్యక్రమం



- 1500 మందికి చల్లటి నీరు అందించిన కృష్ణ గోపాల్ సేవా సమితి

**ఎల్.బి.నగర్, మార్చి27 (నేటి దర్శిని):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం పల్లవి గార్డెన్ సమీపంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో చల్లటి తాగునీటి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1500 మంది బాటసారులు చల్లటి నీటిని సేవించి తమ దాహాన్ని తీర్చుకున్నారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారులకు తాగునీరు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సమితి కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా పాల్గొన్నారు. అలాగే సభ్యులు సునీల్ దరాడే, సురేష్ ధావలే, ఎం. స్వామి, కె. నాగ్నాథ్, ధావలే ఆకాష్ తదితరులు తమ శాయశక్తులా సేవలందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానికులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**ఖమ్మం,మార్చి 27 (నేటి దర్శిని):** శ్రీరామనవమి పురస్కరించుకొని ఇందిరానగర్ పర్ణశాల వద్ద వాసవి క్లబ్ రోటరీ నగర్ ఆధ్వర్యంలో భక్తులకు భారీగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమనికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కడవెండి శ్రీనివాస్ అతిధిగా పాల్గొన్నారు స్థానిక ఖమ్మం అర్బన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పాల్గొన్నారు వాసవి క్లబ్ రోటరీ నగర్ లో గత పది సంవత్సరాలుగా నిరంతరం శ్రీరామనవమి సందర్భంగా మజ్జిగ మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మా శెట్టి వరప్రసాద్ , కొదమూరి జగన్నాథం రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, క్లబ్ ప్రెసిడెంట్ కాజా వెంకటేశ్వరరావు, సెక్రెటరీ కల్వకుంట్ల వెంకట్రావు, ట్రెజరర్ వంశి క్లబ్ మాజీ అధ్యక్షులు సోమా శేషగిరిరావు , పాల్వాయి వెంకటేశ్వరరావు, సభ్యులు నూనె గోపాలరావు, కల్వకుంట్ల హనుమంతరావు, రాయల బసవేశ్వర రావు, పాల్వాయి నాగేశ్వరరావు ,రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## మారుతి వారి గూడెంలో ఘనంగా సీతారాముల కళ్యాణం



**నిడమనూరు, మార్చి 27 (నేటి దర్శిని):** నిడమనూరు మండలంలోని మారుతి వారి గూడెం గ్రామంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. స్వామివారి కళ్యాణాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించగా, గ్రామంలోని పెద్దలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తి పరవశంతో నిండిపోయింది.కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఎల్లప్పుడూ ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## జన్ విశ్వాస్ సవరణ బిల్లుపై గళమెత్తిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, మార్చి 27 (నేటి దర్శిని బ్యూరో):** జన్ విశ్వాస్ సవరణ బిల్లుపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గళమెత్తారు. వ్యాపార సౌలభ్యం పేరుతో తీసుకొస్తున్న ఈ బిల్లులో పలు కీలక నిబంధనలను డీక్రిమినలైజ్ చేయడం వల్ల నియంత్రణ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రత్యామ్నాయ అమలు విధానాలు బలంగా లేకుండా చట్టపరమైన శిక్షలను తగ్గించడం వల్ల ఉల్లంఘనలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, పర్యావరణం, కార్మిక హక్కుల వంటి కీలక రంగాలు దెబ్బతినే ప్రమాదం ఉందనిహెచ్చరించారు. వ్యాపారాలకు అనుకూలత కల్పించడమే కాకుండా ప్రజల హక్కులు, భద్రతను కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి కీలక సవరణలపై విస్తృత చర్చ జరిపి, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు.

## చైతన్యపురిలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

### పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొనడం



**చైతన్యపురి, మార్చి27 (నేటి దర్శిని):** శ్రీరామనవమి సందర్భంగా చైతన్యపురి డివిజన్‌లో శుక్రవారం భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీమణి, జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమలా సుధీర్ రెడ్డి కూడా ఈ వేడుకల్లో పాల్గొని భక్తులతో కలసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయి నగర్, ద్వారకాపురం, న్యూ ఎం.సి.హెచ్ కాలనీ, మారుతీ నగర్ కాలనీలలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాలు భక్తి పరవశంతో కొనసాగాయి. అదేవిధంగా మిత్రుడు విశ్వప్రేమ్ నివాసంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో కూడా నాయకులు పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో చంద్రశేఖర్ రెడ్డితో పాటు జలంధర్, పులి కిరణ్, నరేష్, అఖిల్, నవీన్, శ్రీధర్, గణేష్, నాగరాజు, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంత బజార్ హనుమాన్ దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం...



అమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం.కేశవులు



**ఆమనగల్, మార్చి 27(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా జరిగింది. హనుమాన్ దేవాలయాన్ని పచ్చటి తోరణాలతో, రకరకాల పూలమాలలతో, కాషాయ జెండాలతో దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. దేవాలయ ఆవరణలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిపించారు. ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి వారిసతీమణి గీతా చారి, మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నాగిళ్ల జగన్,ముక్తాల వెంకటయ్య ,ఎర్రవోలు మహేష్, అల్లాజీ గౌడ్ ,పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం లోకానికి ఆదర్శం: శంకరనందగిరి స్వామీజీ





**నల్గొండ, మార్చి 27 (నేటి దర్శిని):** శ్రీరామనవమి సందర్భంగా నల్గొండ పాతబస్తీ హనుమాన్ నగర్ హిందూపూర్ కాలనీలోని శ్రీ శంకరాశ్రమంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకరనందగిరి మహారాజ్ స్వామీజీ నాగసాధు పరంపర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తులకు కన్నుల విందుగా నిలిచాయి. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, సీతారాముల కళ్యాణం మన సంసార జీవనానికి ఆదర్శమని తెలిపారు. "ఒకే మాట, ఒకే బాణం, ఏకపత్నీవ్రతుడు శ్రీరామచంద్రుడు" అని ఆయన గొప్పతనాన్ని వివరించారు. "ధర్మో రక్షతి రక్షితః" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో పాటించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సీతారాముల లక్ష్మణ ఆంజనేయ స్వాములకు పంచామృత అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించి, వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యాణాన్ని ఘనంగా జరిపారు. ఆశ్రమం నుండి దేవతామూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు మన జీవితానికి మార్గదర్శకాలని స్వామీజీ తెలిపారు. కుటుంబ సఖ్యత, సంస్కృతి, సంప్రదాయాల విలువలను ఈ గ్రంథాలు తెలియజేస్తాయని చెప్పారు. ఆధునిక కాలంలో శాస్త్రసాంకేతిక అభివృద్ధి పెరుగుతున్న కొద్దీ సనాతన ధర్మం తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు చిన్ననాటి నుంచే రామాయణం, మహాభారతం వంటి భారతీయ ఇతిహాసాలను పాఠశాలల్లో బోధించాలని ఆయన పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు దైవారాధనను ఇంట్లో ఆచరిస్తే పిల్లలు సన్మార్గంలో నడుస్తారని సూచించారు. శ్రీరాముడు సత్యం, ధర్మం, న్యాయం, కర్తవ్యనిష్ఠలకు ప్రతీకగా నిలిచారని, ఆయన చూపిన మార్గం ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భక్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ భక్తులు పెరిక ఉమామహేశ్వర్, నవీన్, కిరణ్, శ్రీను, యాదగిరి, మర్రి శంకర్, కృష్ణ, శంకర్ యాదగిరి, సుష్మ, స్వాతి, రోజా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్ ఘాట్‌లో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం





● భక్తులతో కిక్కిరిసిన కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం



**ఎల్.బి.నగర్, మార్చి 27 (నేటి దర్శిని):** స్వయంభూ శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకం, అలంకారం, ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సతీసమేతంగా ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి యన్. లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణతో పాటు ధర్మకర్తలు కూడా స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు సమర్పించారు. వేలాది మంది భక్తులు కార్యక్రమానికి హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకించి భక్తిరసంలో మునిగిపోయారు.కళ్యాణ వేదికకు దూరంగా ఉన్న భక్తుల కోసం రెండు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని స్పష్టంగా వీక్షించే సౌకర్యం కల్పించారు. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. కళ్యాణోత్సవ టిక్కెట్లు పొందిన భక్తులకు ఆలయ అర్చకులు కంకణధారణ చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేయగా, సాధారణ భక్తుల కోసం సుమారు 15,000 మందికి శ్రీ రాజేంద్ర కుమార్ బృందం ద్వారా అన్నదానం నిర్వహించారు. పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన కళ్యాణ వేదికలో వేద పండితులు, అర్చకులు సీతారాముల కళ్యాణ మహిమను వివరించడంతో కార్యక్రమం మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. దేవస్థానం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.కళ్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కార్యనిర్వహణాధికారి, చైర్మన్ మరియు ధర్మకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీ భద్రకాళి దేవాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని భక్తుల రద్దీ...!




**ఉమ్మడి వరంగల్, మార్చి 27(నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి దేవాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సర్వదర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుందని భక్తులు వెల్లడించారు. నగరముతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దైవదర్శనం చేసుకోవడానికి సమయం పట్టడంతో, వేసవికాలం కావడంతో ఉక్క పోతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .ఇప్పటికైనా అధికారులు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.


## శ్రీ భద్రకాళి దేవాలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 27(నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఎమ్మెల్యే స్వయంగా అమ్మవారికి పూలు తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శిని కలిసిన కలెక్టర్లు





**ఉమ్మడి వరంగల్, మార్చి 27 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని హరిత కాకతీయ హోటల్ కు చేరుకున్న కేంద్ర జలశక్తి మంత్రి త్వ శాఖ కార్యదర్శి బి.ఎల్. కాంతారావును వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కలిసి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని జల వనరుల అభివృద్ధి, నదీ పరివాహక ప్రాంతాల పునరుద్ధరణ వంటి అంశాలపై చర్చించారు.

# తిరుమలగిరిలో కోలాహలంగా సీతారాముల కళ్యాణం





**తిరుమలగిరి సాగర్, మార్చి 27 (నేటి దర్శిని):** రెండవ భద్రాచలం గా పేరుగాంచిన తిరుమలగిరి శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం కోలాహలంగా, అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చిలకమర్రి మురళీధర చార్యులు అర్చక బృందంతో కలిసి మంత్రోచ్చారణల మధ్య కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. భద్రాచలంలో జరుగుతున్న కళ్యాణంతో సమకాలంలోనే ఇక్కడ కూడా నిర్వహించడంవల్ల ప్రత్యేకత సంతరించుకుంది. మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి దంపతులు, స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ--సైదులు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముఖ్య అతిథులుగా ఏసీపీ చవ్వ శంకర్ రెడ్డి, సీఐ శ్రీనునాయక్, ఎస్సై వీరశేఖర్ హాజరై కార్యక్రమాన్ని దర్శించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా లక్ష్య స్కూల్ చిన్నారులు ఐదు నిమిషాల్లో "సీత స్వయం వరం" నాటికను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వడపప్పు ప్రసాదం అందించగా, తిరుమలగిరి వీరాభిమన్యు యూత్ ఆధ్వర్యంలో సుమారు 5000 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం 400 మంది యువకులు పాల్గొన్న భారత కోలాటం కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. మార్కెట్ యార్డ్ ఆవరణంలో తెలుగు రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలు నిర్వహించారు. మూడు రోజులుగా సాగిన ఈ ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తిరుమలగిరిని జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా నిలిపారు. ఈ కార్యక్రమంలో శాగం పెద్దిరెడ్డి, కర్నాటి లింగారెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, చవ్వ బ్రహ్మానందరెడ్డి, కాంసాని సంభశివారెడ్డి, ఉప సర్పంచ్ ఇరిగి తిరుపతమ్మ, చెరువు చైర్మన్ పిట్టల కృష్ణ, పిడిగం నాగయ్య, ఆవుల నాసర్ రెడ్డి, నాగేండ్ల వెంకట్ రెడ్డి, చవ్వ నాసర్ రెడ్డి, ఇరిగి గంగయ్య, పసుపులేటి కృష్ణ, జూపల్లి గోపికృష్ణ, పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుపై పూర్తి నిషేధం విధించాలి

- లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్
- గడ్డి మందు పర్యావరణం, ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం
- ఐ ఎం ఏ సహా వైద్య వర్గాల నుంచి గడ్డి మందు నిషేధానికి బలమైన మద్దతు
- ప్రాణాంతక గడ్డి మందుపై కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి



**ఉమ్మడి వరంగల్, మార్చి 27(నేటి దర్శిని బ్యూరో):** దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు అనే అత్యంత ప్రమాదకర హెర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు .అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ రసాయనం గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు మరణాయుధం గా మారిందని ఎంపీ పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, దీనికి ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని అన్నారు.తెలంగాణలోని వరంగల్ సహా పలు జిల్లాల్లో ఇది ఆత్మహత్యలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రమాదకర సాధనంగా మారిందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పర్యావరణం, సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ సహా పలువురు వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధం కోసం ఒత్తిడి తెస్తున్నారని ఎంపీ గుర్తుచేశారు. ప్రమాదకర రసాయనాలకు బదులుగా సురక్షిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

## నాగోల్‌లో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**నాగోల్, మార్చి27 (నేటి దర్శిని):** నాగోల్ గ్రామంలోని కాత్యాయని గార్డెన్స్‌లో శ్రీ సీతారామచంద్రస్వామి గోదా సమేత వేణుగోపాల అష్టలక్ష్మి దేవాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని విశేష వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య స్వామివారి కల్యాణం జరుగగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఎగ్గె మల్లేశం, డైరెక్టర్లు అనంతుల శ్రీనివాసరెడ్డి, రావుల రాజు గౌడ్ తదితరులు పాల్గొని సేవలు అందించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తి వాతావరణంతో మార్మోగింది.

# శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నాగరాజు



**ఉమ్మడి వరంగల్, మార్చి 27(నేటి దర్శిని బ్యూరో):** శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి,శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యేను ఆహ్వానించి వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాల తో పూర్ణ కుంభంతో ఎమ్మెల్యే నాగరాజు ను శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే సమర్పించారు. ఈ కార్యక్రమం భక్తి పరవశంలో, వైభవంగా కొనసాగగా, ఎమ్మెల్యే స్వామివారి దివ్య ఆశీస్సులు పొందుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం, మన భారతీయ సనాతన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శ్రీరాముడు సత్యం, ధర్మం, న్యాయం, కర్తవ్యపాలనకు నిలువెత్తు నిదర్శనమని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సౌహార్దం, నైతిక విలువలు పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలంతా శ్రీరాముని బాటలో నడుస్తూ నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో జీవించాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యంగా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలపై స్వామివారి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, రామాలయ చైర్మన్ పల్లపు అర్జున్, డైరెక్టర్స్, కాజీపేట మండలం అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మడికొండ నాయకులు కార్యకర్తలు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365